తలుపు తట్టి.. నాడి పట్టి

- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు ఆదరణ..
- పదిహేను రోజులకు ఒకసారి గ్రామాల సందర్శన
- మధ్యాహ్నం వరకు శిబిరం వద్ద పేషంట్‌లకు సేవలు
- ఆ తర్వాత మంచానికి పరిమితమైన వారి వద్దకే వైద్యం
- 14 రకాల వైద్య పరీక్షలు.. ఉచితంగా మందులు



గండేపల్లిలో పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జెస్సీ లివింగ్ ఫెయిత్

కంచికచర్ల: ఆరోగ్యం ఎలా ఉంది. సకాలంలో మందులు వాడుతున్నావా...అని ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలుకరిస్తున్న కంచికచర్ల పీహెచ్‌సీ డాక్టర్ కే మధురిమ..

బాగానే ఉంది... మీరు రాసిచ్చిన బీపీ, షుగర్ మందులు వాడుతున్నా.. సమయానికి మందులు ఇస్తున్నావమ్మా.. పర్యాలేదు...

ఇంటికి వచ్చి పరామర్శ..

తమ ఇంటికి వచ్చి పరామర్శిస్తున్న డాక్టర్ కే మధురిమతో ఆనందరంగా శౌరమ్మ సమాధానం. సరే.. గుండె కొట్టుకోవటం. పల్స్ రేట్, బీపీ, సుగర్ అన్నీ బాగానే ఉన్నాయి. ప్రస్తుతం వాడుతున్న మందులు కొనసాగించండి. ఏదైనా సమస్య వస్తే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించండి...లేదంటే నాకు ఫోన్ చేసి మాట్లాడితే చెప్తాను...అంటూ రోగి శౌరమ్మకు భరోసా ఇస్తున్న డాక్టర్ మధురిమ..ఇది మంగళవారం కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామంలో జరిగిన ఘటన.

రోగుల్లో ఆనందం..

'ఫ్యామిలీ డాక్టర్' అనే సరికొత్త కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఇలా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఊరిలోకి వైద్యులు వచ్చి ఇలా ఆరోగ్యం గురించి వాకబు చేస్తుండటంతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవస్థలు తొలగిపోతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డబ్బు..సమయం ఆదా..

కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామానికి చెందిన కటారపు లలితకుమారి ఐదునెలల గర్భిణి, పల్లెకంటి జీవమ్మ.. ఏడవ నెల , బొక్కా శాంతి...8వ నెల వీరంతా గతంలో పెండ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకునేవారు. కనపర్తి రాయప్ప, గుజ్జర్లపూడి భాగ్యయ్య వీరు పక్షవాత బాధితులు. వీరు కూడా ఆటోలో ప్రయాణించి పెండ్యాల పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకునేవారు. డబ్బులు చాలా ఖర్చు అయ్యేవి. పెండ్యాల పీహెచ్‌సీ వైద్యురాలు జెస్సీ లివింగ్ ఫెయిత్ ఫిబ్రవరి 25వ తేదీన గండేపల్లిలోని వారు నివసించే ఇంటి వద్దకే వెళ్లి బీపీ, సుగర్, పరీక్షలు చేసి వైద్యం అందించారు. 15రోజులకు సరిపడా మందులు ఉచితంగా ఇచ్చారు.

అందుబాటులోకి సేవలు.....

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో విలేజ్ క్లినిక్ సేవలు ప్రారంభమయ్యాయి. 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు...67 రకాల మందులు గ్రామాల్లో అందుబాటులోనే ఉన్నాయి. కంచికచర్ల, పెండ్యాల పీహెచ్‌సీ పరిధిలో గర్భిణిలు 496 మంది, బాలింతలు 386 మంది, బీపీ సుగర్ 15 వేల మంది, పక్షవాతం కలవారు...88 మంది ఉన్నారు...



ఇంటికే వచ్చి వైద్యం చేస్తున్నారు..

నాకు బీపీ, సుగర్ ఉంది. గతంలో వైద్యం చేయించుకోవాలంటే కంచికచర్ల, నందిగామ ఆస్పత్రులకు వెళ్లేవాళ్లం. డబ్బులు చాలా ఖర్చయ్యేవి. ఇప్పుడు ఇంటికి వచ్చి వైద్యం చేస్తున్నారు. 15రోజులకు సరిపడా మందులు ఉచితంగా ఇచ్చారు. ఒక్క పైసా ఖర్చు లేదు. చాలా ఆనందంగా ఉంది.

–బలుసు శౌరమ్మ,
బీపీ పేషంట్, గనిఆత్కూరు



తల్లిదండ్రులకు వైద్యం చేస్తున్నట్లుంది..

గ్రామాల్లోకి వెళ్లి రోగుల వద్దకే వైద్యం అందించటం తల్లిదండ్రులకు ఇంటి వద్ద వైద్యం అందిస్తున్నట్లు ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటువంటి సాహసోపేత నిర్ణయం తీసుకోవటం అభినందనీయం. తక్కువ సమయంలో రోగాన్ని రోగి బయటపడే అవకాశాలు ఉన్నాయి.

–డాక్టర్ కే మధురిమ,
పీహెచ్‌సీ వైద్యురాలు, కంచికచర్ల

ఫ్యాక్టరీ కాలుష్యంతో ఇబ్బందులు

సీపీఎం జిల్లా కార్యదర్శి కృష్ణ



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: మండలంలోని షేర్‌మహ్మద్‌పేట సమీపంలో కాలుష్యాన్ని వెదజల్లుతున్న గ్రీన్ టెక్ ఫ్యాక్టరీని తొలగించేంత వరకు సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని ఎన్టీఆర్ జిల్లా సీపీఎం కార్యదర్శి డీవీ.కృష్ణ అన్నారు. స్థానిక డీవీఆర్ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో మంగళవారం సీపీఎం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ గ్రీన్‌టెక్ ఫ్యాక్టరీని తొలగించాలని గత కొన్ని ఏళ్లుగా ఉద్యమం చేస్తున్నా, ఫ్యాక్టరీని ఎప్పుడు తొలగిస్తారో నిర్దిష్టంగా చెప్పాలన్నారు. ఈ ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం వలన ప్రజలపై అనేక దుష్ప్రభావాలు చూపుతుందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టిడ్కో ఇళ్లలను లబ్ధిదారులకు త్వరలో అందించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కే హెచ్.శ్రీనివాస్, పేట పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి, సీనియర్ నాయకులు సీహెచ్.హనుమంతరావు, కోట కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

వీరులపాడు(దొడ్డదేవరపాడు): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని ఎంఈవో ఎల్ చిట్టిబాబు పేర్కొన్నారు. వీరులపాడు మండలం వీ అన్నవరం, దొడ్డదేవరపాడు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలాలను మంగళవారం పరిశీలించారు. జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. గ్రామ సర్పంచ్‌లు జమ్ముల వరబాబు, చెండ్యాల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు తోట నారాయణరావు పలువురు నాయకులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

- జాతీయ డీవార్మింగ్‌డేలో వక్తలు
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థులకు నులి పురుగుల నివారణకు మాత్రలు అందజేస్తున్న కమిషనర్

నందిగామ: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తే అనారోగ్యం దరి చేరదని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరామ్ పేర్కొన్నారు. జాతీయ డీవార్మింగ్ డే సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ టాబ్లెట్లను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా నులి పురుగుల నివారణ మందులను అందజేస్తుందన్నారు. వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. హెచ్‌ఎం రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. పట్టణ శివారు అనాసాగరం గ్రామంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కౌన్సిలర్ పాకాలపాటి కిరణ్ చిన్నారులకు నులి పురుగుల టాబ్లెట్లను పంపిణీ చేశారు. మండలంలోని పల్లగిరి, రామిరెడ్డిపల్లి ఎంపీయూపీ పాఠశాలలలో, లింగాలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల మందులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: మండలంలోని పాఠశాలల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ప్రారంభించారు. పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు సుజన, ఇందిర మాట్లాడుతూ ఈ కార్యక్రమం 19 వరకు జరుగుతుందన్నారు. 1 నుంచి 19 వయస్సు గల పిల్లలందరూ ఈ మాత్రలు తప్పని సరిగా వేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఈమాత్రలను ఉచితంగా అందిస్తుందన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, పాఠశాల హెచ్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): నులి పురుగుల నిర్మూలనకు ప్రభుత్వం అందిస్తున్న ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుని సహకరించాలని సర్పంచ్ లక్ష్మీత్రివేణి నాయుడు అన్నారు. జాతీయ నులి పురుగల నిర్మూలన కార్యక్రమంలో భగంగా మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మాత్రలు వేసే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వత్సవాయి : విద్యార్థులు చిన్నతనం నుంచే ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జెడ్పీటీసీ యేళపోగు దేవమణి సూచించారు. మంగళవారం జెడ్పీ, గురుకుల పాఠశాలలో నులి పురుగుల నివారణ టాబెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఈ మందును వేసుకున్నట్లయితే విద్యార్థులలో ఎదుగదల ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్, వైద్యాధికారిణి సుష్మాప్రియదర్శిని, ఈవోపీఆర్డీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అప్పుడే ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధ్య పడుతుందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. అనంతరం మాట్లాడుతూ ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారందరికి ఈ మందు వేయాలన్నారు. చేతులు పలు మార్లు శుభ్రంగా కడుగుకోవాలని సూచించారు. పాఠశాల ఎదురుగా ఉన్న డ్రెయినేజి వ్యవస్థ సరిగా లేదని తెలుసుకున్న ఆయన వెంటనే మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. పాఠశాలకు ఎదురుగా ఉన్న ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ శివ కోటేశ్వరరావు, కౌన్సిలర్ వట్టెం మనోహర్, హెచ్‌ఎం వాణి, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ షాలిని, వాసంతి, మోహన్, సూపర్‌వైజర్ జానకీదేవి, ఏఎన్‌ఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.



నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న జెడ్పీటీసీ దేవమణి



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



పెనుగంచిప్రోలులో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సర్పంచ్ పద్మకుమారి, డాక్టర్ సుజని

మియాపూర్‌కు నూతన బస్సు సర్వీసు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ప్రజా రవాణా సంస్థ విజయవాడ నుంచి మియాపూర్‌కు స్టార్ లైనర్ (నాన్ ఏసీ స్లిపర్ కోచ్) నూతన బస్సు సర్వీసును ప్రారంభించింది. సర్వీస్ నంబర్ 3535 తో నడుపుతున్న ఈ బస్సును మంగళవారం సాయంత్రం విజయవాడ మెయిన్ డిపో నుంచి జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ప్రారంభించారు. ఈ బస్సు రోజూ రాత్రి 11.15 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు మి యాపూరు చేరుతుంది. తిరిగి రాత్రి 10 గంటలకు బయలు దేరి ఉదయం 5.30 కు విజయవాడ చేరుకుంటుంది.

క్లుప్తంగా

ఆలయానికి రూ.6.05 లక్షల ఆదాయం



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ ప్రాంగణంలో, సత్రాల్లో టెంట్ సామగ్రి అద్దె హక్కులకు మంగళవారం జరిగిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.6.05 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్ తెలిపారు. ఆలయ బేడా మండపంలో మిగిలిన వేలంకు పాటదారులు రాని కారణంగా వాయిదా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఈఈ వైకుంఠరావు, దేవదాయశాఖ నందిగామ డివిజన్ తనిఖీదారు అనురాధ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

23న సీపీఐ భవనం ప్రారంభం



పెనుగంచిప్రోలు: గ్రామంలో నూతనంగా నిర్మించిన కర్ల లింగయ్య కళాభవన్, సీపీఐ కార్యాలయాన్ని ఈనెల 23న ప్రారంభిస్తున్నట్లు సీపీఐ సీనియర్ నాయకులు వల్లం కొండ బ్రహ్మం, పాన్నం నరసింహారావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ భవనాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభిస్తారన్నారు. సీపీఐ నాయకులు చల్లాల శివాజీ, జక్కులూరి వెంకటేశ్వర్లు, వేల్పుల కాంతయ్య, నలగర్ల కృష్ణ, కటారపు కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శిలువ మార్గం



తోటచర్ల(పెనుగంచిప్రోలు): మానవాళి రక్షణ కోసం మహోన్నతుడైన ఏసుప్రభువు సిలువ యాగం పొందారని రెవరెండ్ ఫాదర్ శాంతిరాజు అన్నారు. మంగళవారం గ్రామంలోని లూర్ధుమాత ఆలయం(ఆర్‌సీఎంచర్చి) ఆధ్వర్యంలో పవిత్ర శిలువ మార్గం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు మాల ధరించినవారు గ్రామంలో శిలువ మోస్తూ ప్రార్థనలు చేశారు. అనంతరం ఫాదర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవాళి పాపాల కొరకు మరణించి సమాధి చేయబడి మూడవ రోజున ఉత్థానమై లేచి పరలోక ప్రాప్తిని పొందారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపదేశకులు పిల్లి జోజి, కోటేశ్వరరావు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జయంతి(వీరులపాడు): మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమని అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. వీరులపాడు మండలం అల్లూరు, జయంతి గ్రామాల్లో డీఆర్‌డీఏ ద్వారా డ్వాక్రా సంఘ సభ్యులకు 25 మందికి ఒక్కొక్కరికి 6 పొట్టేలు పిల్లలను శ్రీనిధి ఉన్నతి గ్రామ సంఘాల ద్వారా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు వైస్ ఎంపీపీ వేమూరి అదాం, బందెల రాణి, మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఇప్పల సత్యనారాయణరెడ్డి, మొండ్రు బాయమ్మ, ఏపీఎం, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి యోగా అవసరం



కంచికచర్ల: ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సిద్ధ సమాధి యోగా గురువు పేరం అర్లప్ప అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో మంగళవారం ఉదయం యోగాసనాల కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అసనాలు చేయటం, నడవటం, ఇంటి వద్ద పనులు చేసి శరీరానికి శ్రమ కలిగించాలన్నారు. దీని వల్ల శారీరక రుగ్మతలు తొలగిపోయి, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహన్‌రావు, కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, నాయకులు పెద్దినీడి కోటేశ్వరరావు, బీవీ సర్వేశ్వరరావు, బీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

చౌటపల్లి(వీరులపాడు): రోడ్డు ప్రమాదంలో గత సోమవారం మృతి చెందిన అంబోజి దుర్గప్రసాద్ భార్య అన్నమ్మకు గ్రామ సర్పంచి పల్లెపోగు పుల్లయ్య, వార్డు సభ్యుడు రమేష్ మంగళవారం రూ.5 వేల అర్థిక సాయం అందించారు. వారు మాట్లాడుతూ మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి అన్ని సంక్షేమ పథకాలు వచ్చేవిధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి కోట సంగయ్య, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

–జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్



జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి జుబేర్‌ను సన్మానిస్తున్న ముస్లిం నాయకులు, పెద్దలు

జగ్గయ్యపేట అర్బన్: ముస్లింల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి వారికి పెద్ద పీట వేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డికి, అనంతరం ఆయన వారసుడు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వక్ఫ్ బోర్డు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శిగా పట్టణానికి చెందిన షేక్ జుబేర్ నియమితులైన సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక కౌసర్ మసీదు ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు. జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శిగా షేక్ జుబేర్ నియామకం పట్ల పలువురు ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. ఉల్మాలు, ఆలింలు, పలువురు ముస్లిం పెద్దలు ఆయనకు అభినందనలు తెలిపారు. వక్ఫ్ బోర్డు కార్యదర్శి జుబేర్ మాట్లాడుతూ తన ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే ఉదయభానుకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్ బోర్డు అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. పార్టీ మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రస్ హుస్సేన్, పట్టణ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, మైనార్టీ నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, ఎస్‌ఎస్‌పీ సైదా, ఎక్సైజ్ బాషా, ఖాజా,ఖాదర్‌బాబు, ముస్లిం యువకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

పూర్తయిన ఏర్పాట్లు

జగ్గయ్యపేట అర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని పేట డివిజన్ కస్టోడియన్ శౌరీలమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పరీక్షల వివరాలను తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించే ఈ పరీక్షల్లో పట్టణంలో మొత్తం నాలుగు పరీక్షా సెంటర్ల నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులు 1100 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 1200 మంది, మొత్తం 2300 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష సెంటర్లుగా ఎస్‌జీఎస్ కళాశాల, వాగ్దేవి మహిళా కళాశాల, జేఆర్సీ కళాశాల, అమ్మాణి కళాశాల ఉన్నాయని తెలిపారు.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాల్లో అరగంట ముందుగా హాజరు కావాలని పేర్కొన్నారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత ఉండాలి

ఎస్‌ఎస్‌ఏ ఏఎంఓ సురేష్

మోగులూరు(కంచికచర్ల): నాడు-నేడు పథకం ద్వారా చేపట్టే పనుల్లో ప్రభుత్వ నిబంధన మేరకు పనులు చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సమగ్ర శిక్షాభియాన్ అకడమిక్ మోనటరింగ్ అధికారి సురేష్ అన్నారు. మండలంలోని మోగులూరు ఎంపీపీ స్కూల్‌లో నాడు-నేడు పథకం ద్వారా చేపట్టిన పనులను మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, నాడు-నేడు పథకం ఫేజ్-2 కింద పాఠశాలకు మంజూరయిన రూ. 4.17 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. బడి బయట ఉన్న పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన భోజనం మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందించాలన్నారు. విద్యార్థులు ఏదేనీ అనారోగ్యపాలయితే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య పరీక్షలు చేయించి అవసరమైన మందులు ఇప్పించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షాభియాన్ కమ్యూనిటీ మొబలైజర్ రాంబాబు, పెండ్యాల పీహెచ్‌సీ డాక్టర్ వీపీఎన్ వర్మ, హెచ్‌ఎం విజయలక్ష్మి, సీఆర్పీలు బంకా బడేమియా, రాజు, మేకల విజయలక్ష్మి, కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు హక్కు పత్రాలతో హాజరు కావాలి

నందిగామ ఆర్డీఓ రవీంద్రరావు



హద్దురాళ్ల ఏర్పాటుపై సూచనలిస్తున్న ఆర్డీఓ రవీంద్రరావు

కంచికచర్ల: రీ సర్వే చేసిన భూముల్లో ప్రభుత్వం పంపిణీచేసిన హద్దు రాళ్లను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని నందిగామ ఆర్డీఓ ఏ రవీంద్రరావు అన్నారు. మండలంలోని పరిటాలలో మంగళవారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా పభుత్వ, ప్రవేటు భూములను రీ సర్వే చేసి రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఆ భూములకు ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. రైతులు, కౌలురైతులు తమ సిబ్బందికి సహకరించాలన్నారు. తహసీల్దార్ వీ రాజకుమారి, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్ధన్, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న సర్పంచ్ జ్యోతిబ్రహ్మం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కోట నాటేశ్వరరావు మృతి చెందటంతో భార్య కోట ప్రమీల, పంది నరసయ్య మృతి చెందటంతో భార్య జ్యోతికి మంగళవారం స్థానిక సచివాలయంలో వైఎస్సార్ బీమా కింద ఒకొక్కరికి మంజూరైన రూ.లక్ష నగదును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు గంగూరి ప్రసాద్, సచివాలయాల కన్వీనర్ ఉన్నం శ్రీనివాసరావు, నాయకులు దోసపాటి దానయ్య, ప్రసాద్, గ్రామ కార్యదర్శి హలీమ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 23వ వార్డుకు చెందిన పునుగుపాటి లక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. ఈ సందర్భంగా ఆమెకు మంజూరైన వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించి, ముందుగా మట్టి ఖర్చుల కింద మంజూరైన రూ.10 వేలను మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్ దువ్వల రమాదేవి మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు దువ్వల రామకృష్ణ, సచివాలయం సిబ్బంది, వలంటీర్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

గుణదల (విజయవాడ తూర్పు) : దృష్టి లోపాలతో ఉన్న విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలను ప్రోత్సహిస్తే ఎంతటి లక్ష్యాలపైనా సాధించగలరని ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ అన్నారు. సామర్థ్యాల దినోత్సవం పురస్కరించుకుని లయోలా కళాశాల ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల ఉన్నత విద్య విభాగం ఆధ్వర్యంలో దృష్టిలోపం కలిగిన దివ్యాంగులకు పలురకాల పోటీలు, ఉపకారవేతనాల పంపిణీ చేశారు. ఇంద్రియాల ద్వారా వాసన, స్పర్శలతో వస్తువులను గుర్తించే 'గెస్ ది ఐటం' పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రెయిలీ లిపి పఠనం, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహు మతులు అందజేశారు. ఆడిటోరియంలో హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ (చెన్నై) ఆధ్వర్యంలో 36 మంది దృష్టిలోపం కలిగినదివ్యాంగులకు రూ. 4.05 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ ట్రస్టీ దీపా కృష్ణమూర్తి ఆన్‌లైన్ ద్వారా దివ్యాంగులను అభినందించారు. సమ ర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో మరో 18 మంది ది వ్యాంగులకు రూ.3.57 లక్షల స్కాలర్‌షిప్‌లను అందించారు. ట్రస్ట్ ఏపీ చాప్టర్ అధ్యక్షుడు ఎంఆర్‌కే పరమహంస పాల్గొన్నారు.